క్లుప్తంగా

అరకు ఎమ్మెల్యేకు ఘన సత్కారం



అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంను సత్కరిస్తున్న నాయకులు

అరకులోయటౌన్: అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంను వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షురాలు సుమిత్ర ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను దుశ్శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు మంచి పాలన అందించాలని ఆకాంక్షించారు. మండల పార్టీ మాజీ అధ్యక్షుడు కొర్రా గాసి, మార్కెట్ యార్డ్ చైర్మన్ రాజరమేష్, పద్మాపురం సర్పంచ్ పెట్టెలి సుష్మిత, నాయకుడు కమిడి అశోక్ పాల్గొన్నారు.

నేడు, రేపు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో ఈ నెల 15,16వ తేదిల్లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్టు వైద్యాధికారి గీతాంజలి తెలిపారు. ఆమె ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ క్యాన్సర్ ప్రమాదకర వ్యాధి అని, ముందుగానే గుర్తిస్తే ప్రాణాలను కాపాడుకోవచ్చునన్నారు. గత కొన్ని రోజులుగా క్యాన్సర్ బాధితుల సంఖ్య పెరుగుతుందని, ముందుగానే క్యాన్సర్ వ్యాధి లక్షణాలను గుర్తించకపోవడంతోనే వ్యాధి పెరుగుదలకు ముఖ్య కారణం అని అన్నారు. శరీరంలో గడ్డలు ఏర్పడడం, గొంతులో దీర్ఘకాలంగా గరగర, మింగడంలో ఇబ్బందులు, అజీర్తి, అధికంగా రక్తస్రావం, శరీరంలోని బరువులో తేడాలు వంటివి క్యాన్సర్ లక్షణాలని చెప్పారు. క్యాన్సర్ వ్యాధి లక్షణాలు ఉంటే సీహెచ్‌సీలో నిర్వహించే స్క్రీనింగ్ పరీక్షలు చేసుకోవాలని సూచించారు. ఈ శిబిరాన్ని మండలవాసులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

బస్సు పాసులకు రేపు దరఖాస్తుల స్వీకరణ

ఎటపాక: దివ్యాంగులు, స్టూడెంట్ ఫ్రీ బస్ పాసులు, స్టూడెంట్ పేమెంట్ పాసులు కావలిసిన వారి నుంచి నెల్లిపాకలో గోకవరం ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో మంగళవారం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు దివ్యాంగుల కో–ఆర్డినేటర్ రవి, రాజు ఆదివారం తెలిపారు. దివ్యాంగుల బస్ పాసులు కావాల్సిన వారు సదరం సర్టిఫికెట్, ఆధార్ జెరాక్స్, వైకల్యం ఫోటో, రూ.100 నగదు, ఫోన్ నంబర్ తీసుకురావాలని సూచించారు. ఈ అవకాశాన్ని నాలుగు మండలాల వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 97017 89327 నంబర్‌ని సంప్రదించాలని తెలిపారు.

నిస్వార్థ సేవలకు గుర్తింపు



బలరాం, నరసింహమూర్తిలను సన్మానిస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు తదితరులు

ముంచంగిపుట్టు: మండలంలోని కర్రిముఖిపుట్టు పంచాయతీ కేంద్రంలో ఇటీవల పోలీసు శాఖలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన ముఖి బలరాం, ముఖి నరసింహమూర్తిలను స్థానిక ఉద్యోగుల సేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సహచర ఉద్యోగులు, సర్పంచ్ పుల్‌మొత్తి, నేతలు అర్జున్, రాంప్రసాద్ తదితరులు మాట్లాడుతూ విధి నిర్వహణలో నిస్వార్థ సేవలు చేసిన వారికి సమాజంలో అన్ని వేళల్లో గుర్తింపు ఉంటుందన్నారు. 40ఏళ్లగా వారు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి సప్తాహ కార్యక్రమాలు

మునగపాక: మండల కేంద్రంలో సాయిబాబా ఆలయంలో ఈ నెల 15 నుంచి సప్తాహ కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ నిర్వాహకులు బొడ్డేడ వీరేంద్ర తెలిపారు. సోమవారం ఉదయం 6 గంటల నుంచి అఖండ జ్యోతి వెలిగించి ఓం సాయి శ్రీ సాయి జయజయ సాయి భజన కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా నిర్వహించే భజన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అలాగే 21 వ తేదీన ఉదయం 5 గంటలకు హారతి, మేలుకొలుపు , 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మహానైవేద్యం జరుగుతుందన్నారు. అదే రోజు మధ్యాహ్నం 12 గంటలకు భారీ అన్న సమారాధన జరుగుతుందన్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

- పొంగి ప్రవహిస్తున్న గెడ్డలు, వాగులు
- రాకపోకలకు అవస్థలు
- నీట మునిగిన పంటలు



లక్ష్మీపురంలో ఉధృతంగా ప్రవహిస్తున్న సుత్తిగూడ గెడ్డ

ముంచంగిపుట్టు/అరకులోయ రూరల్/పెదబయలు/కొయ్యూరు/జి.మాడుగుల/రాజవొమ్మంగి: అల్లూరి జిల్లా అంతటా రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డలను దాటలేక గిరిజనులు గ్రామాలకే పరిమితమయ్యారు. ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డలు దాటలేక గిరిజనులు గ్రామాలకే పరిమితమయ్యారు. కొన్ని గ్రామాల గిరిజనులు నిత్యావసర సరకులు, అత్యావసర పనులతో ప్రాణాలకు తెగించి ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డలను దాటుకొని వెళ్తున్నారు. వరి పంట పొల్లాలోకి వరదనీరు చేరడంతో పంటలు పాడయ్యాయి. మండలంలో పలు గ్రామాల్లో ఈదురు గాలులకు రహదారికి అడ్డంగా చెట్లు పడడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. స్థానికులు చెట్లు తొలగించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

వీధుల్లో వర్షపునీరు

ముంచంగిపుట్టు మండలంలో లక్ష్మీపురం, బుంగాపుట్టు, ముంతగుమ్మీ, బిర్రిగూడ, ఉబ్బెంగుల,దొరగూడ,కర్లాపోదర్ గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. సుమారు 32 గ్రామాల గిరిజనులు రాకపోకలకు తీవ్ర విఘాతం కలిగింది. పెదబయలు మండలంలో గిన్నెలకోట, కించూరు, జామిగుడ, కిముడుపల్లి పంచాయతీలో గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి, మండల కేంద్రంలో డ్రైనేజీ వ్యవస్థ బాగా లేకపోవడంతో రోడ్లన్నీ చెరువుల్ని తలపిస్తున్నాయి.వీధుల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. గిన్నెలకోట గెడ్డ పొంగి ప్రవహిస్తుండడంతో గిన్నెలకోట, పుట్టకోట చామగెడ్డ, ఇనుపతీగల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే జామిగుడ పంచాయతీ గుంజివాడ, చింతలవీధి, కొజ్జరిగుడ, కెందుగుడ, తారాబు గ్రామాలు.గుల్లేలు పంచాయతీ కించూరు గ్రామాలకు రాకపోకలు స్తంభించింది. కొయ్యూరు మండలంలోని కొయ్యూరు, బూదరాళ్ల, తీగలమెట్ట కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. యు.చీడిపాలెం, గొట్టుపాడు కాలువ ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు కొద్దిసేపు నిలిచాయి. జి.మాడుగుల మండలంలో నుర్మతి పంచాయతీలో టెంకలగెడ్డ, కిల్లంకోట పంచాయతీలో కోడిమామిడి గెడ్డలు, బొయితిలి పంచాయతీలో మద్దిగరువు, సొలభం పంచాయతీలో ఎస్.కొత్తూరు మార్గంలోగెడ్డలు, గడుతూరు కుడ్డంగి గెడ్డ, వసమామిడి మార్గంలో గెడ్డలు, వంతాల పంచాయతీలో గంటరాయి వద్ద గెడ్డ ఇతర గెడ్డలు, కుంబిడిసింగి సంగం గ్రామం వద్ద మత్స్యగెడ్డలు, రాళ్లగెడ్డలు ఉధృతంగా పొంగి ప్రవహిస్తున్నాయి. గెడ్డలకు ఆనుకొని ఉన్న పంటపొలాలు నీటమునిగాయి. పాడేరు– జి.మాడుగుల, చింతపల్లి రోడ్డు మార్గాలు, నుర్మతి, బొయితిలి, సొలభం, గడుతూరు, వంతాల, వంజరి, గెమ్మెలి, తాజంగి, నర్సీపట్నం రోడ్డు మార్గాల్లో రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



పొంగి ప్రవహిస్తున్న గిన్నెలకోట గెడ్డ



ముంచంగిపుట్టులో రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు కొమ్మ

వట్టిగెడ్డ రిజర్వాయర్‌లో భారీగా వరదనీరు

రాజవొమ్మంగి మండలంలోని గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని అప్పలరాజుపేట వద్ద గల వట్టిగెడ్డ జలాశయం (రిజర్వాయర్)లోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. దీంతో ఈ రిజర్వాయర్ పూర్తిగా నిండి, నిండుకుండను తలపిస్తోంది. దీంతో నిండు మిగులు జలాలు పొర్లు మదుం ద్వారా దిగువకు ప్రవహిస్తున్నాయి. అలాగే లబ్బర్తి జంక్షన్- నెల్లిమెట్ల గ్రామాల మధ్య గల మరో చిన్నేరు వాగు చప్టా మీదుగా ప్రవహిస్తోంది. భారీ వర్షాలకు సాగు భూములు చెరువులను తలపిస్తున్నాయి. ఇదిలా ఉండగా ఎన్‌హెచ్-516ఈ రహదారి నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో రాజవొమ్మంగి జంక్షన్ వద్ద బురద చేరింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడ్డారు. కొండ కాలువ నీరు ఈ రహదారిపై ప్రవహిస్తుండడంతో స్థానికులు నానా ఇబ్బంది పడుతున్నారు. భారీ వర్షాలకు పలుచోట్ల ఖరీఫ్ వరి సాగు పనులు ఊపందుకొన్నాయి. ఎక్కడ చూసినా రైతాంగం దమ్ములు చేస్తూ, వరి నారుమడులు తయారు చేస్తు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.



వట్టిగెడ్డ రిజర్వాయర్ పొర్లు మదుం ద్వారా ప్రవహిస్తున్న నీరు



కించాయిపుట్టులో నీట మునిగిన పొలాలు



అరకులోయలో కురుస్తున్న వర్షం



పెదబయలులో ముంచెత్తిన వర్షపునీరు

పిచ్చిమొక్కల తొలగింపు



హౌసింగ్ కార్యాలయం ముందు పిచ్చిమొక్కలు (నాడు)



కార్యాలయం ముందు తొలగించిన పిచ్చిమొక్కలు (నేడు)

సాక్షి ఎఫెక్ట్..

కొయ్యూరు: 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. మండల కేంద్రంలోని హౌసింగ్ కార్యాలయం చుట్టూ పిచ్చిమొక్కలు పేరుకపోవడంతో భవనం నిరుపయోగంగా మారడంతో 'సాక్షి' లో ఈనెల 13న 'నిరుపయోగంగా హౌసింగ్ భవనం' శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించి భవనం చుట్టూ పేరుకపోయిన పిచ్చిమొక్కల తొలగింపు పనులను చేయించారు. కార్యాలయాన్ని శుభ్రంగా ఉంచారు. ఇక్కడ కార్యాలయాన్ని వినియోగించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆ శాఖకు చెందిన వారు చెబుతున్నారు. రెగ్యూలర్ జేఈలు లేకపోవడంతో వర్క్ ఇనస్పెక్టర్లు పర్యవేక్షణ చేస్తున్నారు. సమస్యను వెలుగులోకి తీసుకొచ్చి పరిష్కార మార్గం చూపిన 'సాక్షి'కి, స్పందించిన అధికారులకు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

305 మందికి వైద్య పరీక్షలు



శిబిరంలో వైద్య సేవలు పొందుతున్న రోగులు

రంపచోడవరం: రంపచోడవరంలో రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు.వైద్య శిబిరంలో డాక్టర్లు టీవీ సుబ్బారావు, రాయుడు శ్రీనివాస్, దాసరి ఉమా మహేష్, ఎస్.సంపత్‌కుమార్‌లు సుమారు 305 మందికి వైద్య సేవలు అందించారు. అవసరమైన 81 మందికి రక్తపరీక్షలు నిర్వహించారు. పరమహంస యోగానంద నేత్రాలయం(వేమగిరి) ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించి 70 మందికి కంటి పరీక్షలు చేశారు. 28 మందికి కళ్లద్దాలు అందజేశారు. ఆరుగురుకి కంటి ఆపరేషన్ నిమిత్తం వేమగిరి తరలించినట్టు స్వామి పరిజ్ఞేయనందజీ తెలిపారు. జీబీఆర్ ఫౌండేషన్ ద్వారా ఫిట్స్ క్యాంప్ నిర్వహించారు. డాక్టర్ గోపాలం శివన్నారాయణ ఆధ్వర్యంలో 75 మందికి పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. రామకృష్ణ మిషన్ అందిస్తున్న సేవలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈ వైద్యశిబిరంలో క్యాంప్ కో–ఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల్లో కలాం చిత్ర ప్రదర్శన





కొయ్యూరు, పాడేరులోని శ్రీ కృష్ణాపురం ఆశ్రమ పాఠశాలల్లో ఐయామ్ కలాం చిత్రాన్ని వీక్షిస్తున్న విద్యార్థులు

కొయ్యూరు: సెలవు రోజుల్లో విద్యార్థులు బయటకు వెళ్లకుండా ఉండేందుకు వీలుగా ఆశ్రమ పాఠశాలల్లో సందేశాత్మక చిత్రాలను ప్రదర్శిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ఐయామ్ కలామ్ సినిమాను ప్రదర్శించారు.అబ్దుల్ కలాం జీవిత చరిత్రను ఈ చిత్రంలో చూపించారు.ఆయన చిన్నతనంలో పడిన కష్టాలను వివరించారు. గొప్ప శాస్త్రవేత్తగా ఎదిగిన విధానం తెలిపారు. కొయ్యూరు బాలుర-2 పాఠశాలలో వార్డెన్ వేణు దగ్గరుండి విద్యార్థులకు కలాం జీవిత చరిత్రను వివరించారు. ఏదైనా లక్ష్యాన్ని సాధించాలంటే జీవితంలో కష్టాలు ఎన్ని ఎదురైనా వాటిని ఎలా అధిగమించాలో కలాం ప్రేరణగా నిలుస్తారన్నారు.అతడిని అంతా పీపుల్స్ రాష్ట్రపతిగా పిలిచేవారన్నారు. సుదూర లక్ష్యాలను ఛేదించే అగ్ని లాంటి క్షిపణులను తయారు చేసి, విజయవంతంగా ప్రయోగించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. ఈ మేరకు ఆయన క్షిపణి రంగానికి పితామహునిగా నిలిచారని చెప్పారు. చిత్రం పూర్తయిన తరువాత వార్డెన్ విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు.

పాడేరు : ఐటీడీఏ పరిధిలోని అన్ని గిరిజన సంక్షేమ ఆశ్రమ వసతి గృహాల్లో ఆదివారం విద్యారుల కోసం వసతి గృహ నిర్వాహకులు ఐయామ్ కలామ్ చిత్రాన్ని ప్రదర్శించారు. విద్యార్థులకు విజ్ఞాన, వినోదాన్ని అందించే విధంగా ప్రతి ఆదివారం ఓ సందేశాత్మక చలన చిత్రాన్ని ప్రదర్శిస్తున్నారు. విద్యార్థులు సెలవు రోజుల్లో తమ ఇళ్లకు వెళ్ళకుండా ఐటీడీఏ అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆదివారం పట్టణంలోని శ్రీ కృష్ణపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు ఐయామ్ కలామ్ చిత్రాన్ని వీక్షించారు.

వర్షంతో కొట్టుకుపోయిన సామగ్రి



రేగం-తేనెపుట్టు కల్వర్టు దుస్థితి

అనంతగిరి: మండలంలోని అనంతగిరి పంచాయతీ రేగం నుంచి తేనెపుట్టు రహదారిలోని కల్వర్టు పనులు కొంతవరకు జరిగాయి. అయితే గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో గెడ్డ పొంగి ప్రవహించడంతో ఆదివారం కల్వర్టు పనులు, నిర్మాణ సామగ్రి కొంతవరకు కొట్టుకుపోయినట్టు స్థానికులు వాపోయారు. కల్వర్టు పనులు నిమిత్తం తవ్విన గోతులపై నుంచి గెడ్డనీరు పొంగి ప్రవహించడంతో పనులు జరిగే పరిస్థితి లేదని చెప్పారు. దీంతో గిరిజనులు ఆవేదన చెందుతున్నారు. వేసవిలోని పనులు ప్రారంభించి ఉంటే పనులకు ఆటంకం ఉండేది కాదని స్థానికులు చెబుతున్నారు.

కూర'గాయాలు'

- కొండెక్కిన ధరలు..
- విలవిల్లాడుతున్న కొనుగోలుదారులు
- ధరల నియంత్రణకు గిరిజనుల డిమాండ్

ముంచంగిపుట్టులో కూరగాయల ధరలు	
కూరగాయలు	ధర
టమాటా	110
బంగాళదుంప	60
ఉల్లిపాయలు	50
పచ్చిమిర్చి	180
బెండకాయలు	80
వంకాయలు	66
దొండకాయలు	60
బీన్స్	80
క్యారెట్	60
క్యాబేజీ	60
కాకరకాయ	65

ముంచంగిపుట్టు: మన్యంలో కూరగాయల ధరలు కొండెక్కాయి. ఉల్లి ఘాటెక్కింది.. మిర్చి మంటపుట్టిస్తుంది.. బహిరంగ మార్కెట్ లో ఏ కూరగాయలు కొందామనుకున్నా పట్టపగలే చుక్కలు కనిపిస్తున్నాయని కొనుగోలుదారులు బెంబేలెత్తుతున్నారు. బంగాళాదుంప నుంచి వంకాయ వరకు, బెండవాయ నుంచి బీరకాయ వరకు ధరలు భగ్గుమంటున్నా యి. ఇక టమాటా ధర ఠారెత్తిస్తోంది. మన్యంలో కిలో టమాటా సెంచరీకి చేరింది. ఏ కూరగాయ కొనుగోలు చేయాలనుకున్నా కిలో రూ.60 నుంచి రూ.100ల వరకు ధర పలుకుతుంది. రూ.500 పట్టుకొని మార్కెట్‌కు వెళ్తే సంచి సగం కూడా నిండని పరిస్థితి నెలకొందని సామాన్యులు వాపోతున్నారు. మన్యంలో కూరగాయల పంటలు అంతంత మాత్రం కావడంతో మన్యం వాసులకు మైదాన ప్రాంతమైన అనకాపల్లి, మాడుగుల, చోడవరం తదితర ప్రాంతాల నుంచి రావాలి. దీంతో మైదాన ప్రాంతం నుంచి మన్యం ప్రాంతానికి వచ్చేసరికి ధరల్లో వ్యత్యాసం పెరిగిపోతోంది. రూ.30 నుంచి రూ.50 వరకు ప్రతి కాయగూర మీద అధికంగా ధర పడుతుంది. చేతులు మారే కొద్ది ధరల్లో వ్యత్యాసం పెరుగుతుండడంతో కొనుగోలుదారుల జేబులకు చిల్లు పడుతుంది.



మార్కెట్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న కూరగాయలు

ధరలను నియంత్రించాలి

కూరగాయల ధరలు చూస్తే ఏం కొనేటట్టు లేదు. రూ.500 తీసుకు వెళ్లినా సంచి నిండడం లేదు.పెరుగుతున్న ధరలతో కుటుంబంపై మరింత ఆర్థిక భారం పడుతుంది. ప్రస్తుతం ఉన్న ధరలతో సామాన్యుడు బతకడం కష్టంగా మారింది. వారం వారం ధరలు పెరుగుతూ ఉండడంతో అవస్థలు పడుతున్నాము. అధికారులు స్పందించి, ధరపై నియంత్రణ ఉంచాలి.

– ఎస్.లక్ష్మి, గృహిణి, ముంచంగిపుట్టు..

కుళ్లిపోవడంతో నష్టాలు

మైదాన ప్రాంతం నుంచి కూరగాయలు తీసుకువచ్చి విక్రయాలు జరుపుతుండడం వల్ల ధరలు పెరుగుతున్నాయి. దీంతో పాటు కూరగాయలను బుట్టలతో తెస్తుంటే అధికంగా కుళ్లిపోయి ఉంటున్నాయి. వ్యాపారం నష్టాలను కలిగిస్తుంది. కాని వ్యాపారం మానలేకపోతున్నాం.

– పి.ఆనందరావు, కాయగూరల వ్యాపారి, ముంచంగిపుట్టు.

రింతాడలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం

- త్రుటిలో తప్పిన ప్రమాదం
- విద్యుత్ సరఫరాకు అంతరాయం



జాతీయ రహదారిపై నేలకొరిగిన స్తంభం

గూడెంకొత్తవీధి: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మండలంలో వాగులు, గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. రింతాడలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఒక విద్యుత్ స్తంభం ఆదివారం నేలకొరిగింది. ఆ సమయంలో ఎవరూ రహదారిపై లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదని పలువురు చెప్పారు. త్రుటిలో ప్రమాదం తప్పిందన్నారు. విద్యుత్ శాఖ సిబ్బంది స్పందించి నేలకూలిన స్తంభాన్ని పైకి లేపి విద్యుత్తు లైన్లను పునరుద్ధరించారు.

కృష్ణావతారంలో జగన్నాథుడు

అనకాపల్లి: జగన్నాథ నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు ఆదివారం స్వామి కృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో స్థానిక గూడ్స్ రోడ్డులోని ఇంద్రద్యుమ్నహాల్‌లో సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథ స్వామి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా స్వామి వారికి ఆలయ అర్చకుడు బంకుపల్లి సత్యనారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ ఈవో రాజసులోచన, ఉత్సవ కమిటీ చైర్మన్ దాడి బుజ్జి, డైరెక్టర్లు బొండా రాజేష్, మోహన్‌రావు, వెంకట చలపతిరావు, వెంకటవీర అప్పారావు, కోటేశ్వరరావు, ధనలక్ష్మి, భక్తులు పాల్గొన్నారు.



కృష్ణావతార అలంకరణలో జగన్నాథ స్వామి

రామావతారంలో భక్తులకు దర్శనం

కశింకోట: కశింకోటలోని దేవదాయ శాఖకు చెందిన వేణుగోపాల స్వామి ఆలయంలో జగన్నాథ స్వామి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం స్వామిని విష్ణుమూర్తి దశావతారాల్లో ఏడోదిగా శ్రీరామావతారంలో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా జగన్నాథ, సుభద్ర, బలభద్ర ప్రతిమలను అందంగా పూలమాలలు, తులసీ మాలలతో అలంకరించి విష్ణు సహస్ర నామార్చన నిర్వహించారు. భక్తుల గోత్ర నామాలతో అర్చన చేశారు. మంత్ర పుష్పం, మంగళ హారతి సమర్పించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు, అర్చకులు రేజేటి సీతారామాచార్యులు, రేజేటి శ్రీరామ చరణాచార్యులు పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రసాద వితరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

ఘనంగా అమ్మవారి పండగ

రాంబిల్లి (అచ్యుతాపురం): రాంబిల్లి మండలంలోని దిమిలి గ్రామంలో లలితాంబిక అమ్మవారి పండగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయానికి తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు. పండగను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.